# ప్రశ్న త్రయము

చట్టి రామారావుగారు బి.,ఏ.

ఒకప్పుడు ఒకరాజుండెను. అతనికొక నాఁడు వింతగానొక యుద్దేశము కల్గెను. ఒకపనిని జేయుటకుఁదగిన యదను; సరియైన సలహానిచ్చుటకుఁ దగిన మనుష్యులు; ఏక్షణమందైననుఁదా జేయవలసిన ముఖ్యవిధి" వీని నెరిగినచో, బరిపాలనాసందర్భమున తప్పక విజయమొందగలనని యెంచెను.

ఈమూఁడు విషయములకు సరియైన సమాధానములు చెప్పువానికిఁ బెద్దబహుమానమిత్తునని చాటించెను. అనేక పండితులువచ్చిరి. కాని, యొకరి సమాధానము లింకొకరి వానితో నేకీభవింపలేదు. ఒక్కొక్క రొక్కొక్క విధముగాఁజెప్పిరి. రాజు సంతృప్తి పొందలేదు.

ఊరివెలుపల నొకసన్యాసియుండెను. అతఁడు చాల కుశాగ్రబుద్ధియని ప్రసిద్ధి. గొప్పవారనిన నతనికి కోపముమెండు. వారిని దనచెంతకు రానీయడు. కాని వారి కష్టములందు సాయముచేయుచుండెను. ఈసంగతి నెఱిగి, రాజు, మారువేషమున సన్యాసివద్దకు బోయెను.

తన పాకముందు సన్యాసి మొక్కలకు గొప్పు త్రవ్వుచుండెను, "మహాత్మా, మూఁడుప్రశ్నలకు నాకు సమాధానము కావలెను. ఏసమయమున కేపని చేయవలెను?; నేముఖ్యముగా నెవరి సహాయము గోరవలెను? అన్నిటికంటె మహాముఖ్యమైన కర్తవ్యమేమి?" అని రాజడిగెను.

శాంతగంభీరవదనముతో సన్యాసి విని, గొప్పు మరల త్రవ్వసాగెను. "అయ్యా, ఆపార నిటు తెండు. మీ రలసినట్లున్నది. నేఁ గొంచెముసేపు త్రవ్వెదను" అని రాజు పారతీసికొని త్రవ్వెను.

కొంతసేపటికి రాజు పారను గ్రిందనుంచి సమాధానములు చెప్పుడని వేడెను. సన్యాసి పారతీసికొనుచు, "నీవు కాసేపు విశ్రమింపుము" అనగా, వలదని రాజు మరల త్రవ్వ మొదలిడెను. చాలసేపైనది. అతడు విసుగొంది "అయ్యా, మీరు నాకుపదేశము చేయలేనియెడల బోయెదను. సెలవు"అని లేచునంతలో నొకమనుజుడు మహాందోళనములో నచ్చటికి పరుగునవచ్చెను. ప్రక్కలోఁ దగిలిన గాయమునుండి రక్తమువరదలై ప్రవహించుచుండెను. అతడు చేతులతో గాయమును గట్టిగా నొక్కిపట్టెను గాని, యతని చేతులు రక్తముతో తడిసిపోయెను.

రాజతనిగాయమును గడిగి కట్టుకట్టెను. పిమ్మట మంచినీరు తెచ్చి వాని దాహము తీర్చెను.

పొద్దుక్రుంకెను. హాయిగా చల్లగాలి వీచుచుండెను. రాజాశరణాగతుని మెల్లగా పాకలోనికి మోసికొనిపోయి పరుండజేసెను. తానును అందే నిద్రించెను.

ఉదయమున నతఁడు కన్నులు తెరుచునప్పటికి గాయము తగిలినవాఁడు విచారసూచకవీక్షణములతో దీనముగా రాజును

దిలకించుచుండెను. "అయ్యా అపరాధిని నన్ను క్షమింపుము" అని వేడుకొనెను.

"నే క్షమించుటయేమి? నీవెవరవో నే నెరుగనుగదా!"

"కాని మిమ్ము నేనెరుగుదును. మీరు మాయన్న చేసిన నేరమునకై వాని నురి తీయించి వాని యాస్తిని దివాణములోనికిఁ గల్పుకొనిరి. నేను మిమ్ములను జంపెదనని శపథముచేసి, పగసాధించుటకు యత్నించు చుండ భటులు నాజాడలు తీయుచుండిరి. నిన్న మీరొంటరిగా సన్యాసి కుటీరమునకు వచ్చెదరని విని దారిలో బొంచి తిరిగి వచ్చు నప్పుడు చంపనెంచితిని. మీభటులు నన్ను గుర్తించి పొడిచివైచిరి. నేను తప్పించుకొని పారివచ్చితిని. మీరు నా గాయమునకుఁ గట్టు కట్టితిరి. ఎవనిని జంపుటకు యత్నించితినో వానినే శరణుజొచ్చితిని. నే మహా శత్రువని యెవనిని దలచితినో యతడే నాప్రాణ దాతయాయెను. నేజీవింతునేని మీబంటునై మీసేవచేసికొనెదను" అని యా యపరాధి చెప్పెను.

రాజు వానిని క్షమించుటయేగాక వైద్యునిఁగూడఁబంపెదనని చెప్పి ప్రశ్నలకు జవాబులు చెప్పునేమోయని సన్యాసివద్ద కేగెను;

"నీప్రశ్నలకు సమాధానమిదివరకే వచ్చినది." అని సన్యాసియన రాజాశ్చర్య మొందెను.

సన్యాసి యిట్లుపల్కెను "నీవు, నిన్న నాపై జాలిపడి గొప్పుత్రవ్వక నేనీశంకానివారణకావింపలేదని వెళ్లిపోయిన వాడు నిన్ను దప్పక చంపియుండెడివాడు.

కనుక నీవు నాకు సాయమొనర్చిన నిముసమే మంచి ముహూర్తము; ఆక్షణమున నేజాల ముఖ్యమైనమనిషిని అప్పుడు నీవు నాకు సాయముచేయుట నీపరమకర్తవ్యమై యుండెను. ఆమనిషి నీశరణుజొచ్చిన తర్వాత వాని నాదరించి రక్షించిన సనుయమే యుత్కృష్టతరుణము!! ఏలనన నీవట్లు రక్షింపనియెడల అతడు తననేరమునకై పశ్చాత్తాపమొందకే మరణించియుండెడివాడు; కనుక నప్పుడతడు నీకు ముఖ్యావసరమైన మనిషి. నీవతని కొనర్చిన సాయము పరమావశ్యకమైన కర్తవ్యము.

"కాన అనుక్షణమును మహాప్రయోజనము; ఏలనన ఆక్షణమైపోయిన అప్పుడు చేయవలసిన పనినిక చేయుతేము. నీచెంతనున్నవాడే నీ వాక్షణమున ముఖ్యముగా గోరు మనిషి!! ఏలనన అతడు నీశ్రేయోభిలాషి. నీయొద్దనున్నవానికి మేలుచేయుటయే నీముఖ్యమైనవిధి. ఏలన పరోపకారార్థమే మన మీలోకమున జన్మించితిమి. సత్యమును మర్వకుము."

-:0:-